# వాచ్‌మేన్ కూతురు

-శశి సారధి

"ఈ సంగతి విన్నారా?" టీకప్పుతో పాటు బయటకు వచ్చిన శ్రీమతి సంభాషణ మొదలుపెట్టింది.

టీ అందుకుంటూ, "ఏదీ నువ్వు చెప్తే కదా!" అంటూ చిన్న జోకు వేశానుగానీ ఆ సంగతి తప్పకుండా వాచ్‌మేన్ కూతురు గురించే నని నాకు తెలుసు. ఈ బిల్డింగ్‌లోకి వచ్చి ఇంచుమించు రెండు నెలలు అవుతుంది. వాచ్‌మేన్ భార్య ఇంట్లో పనిచేయడానికి చేరి నప్పటి నుంచీ రోజూ వాచ్‌మేన్ కూతురు గుణగణాలు వినడం నా సాయంత్ర దైనందిన కార్యక్రమం అయ్యింది.

"ఇంతకీ ఈ రోజు ఏం చేసింది నీలవేణి?" సరదాగా నవ్వుతూ అడిగాను.

"అంత తేలిగ్గా తీసిపారెయ్యకండి. నిన్న నీలవేణి కంప్యూటర్ కొని తెచ్చిందట" ప్రపంచ వింత గురించి చెపుతున్నట్లుగా కళ్లు పెద్దవి చేసి చెప్తూ. వంటింట్లోకి వెళ్లిపోయింది శ్రీమతి.

కొంచెం గిల్టీగా ఫీల్ అయ్యాను. చాలా రోజుల నుంచి కంప్యూటర్ కొనమని అడుగుతుంది శ్రీమతి.

ఏ నెలకానెల దాటవేస్తూ వస్తున్నాను. పత్రిక లకు చిన్న చిన్న ఆర్టికల్స్ రాసి పంపిస్తుంది శ్రీమతి.

కంప్యూటర్, నెట్ కనెక్షన్ ఉంటే ఆర్టికల్స్ నీట్‌గా పంపించడమే కాకుండా. తన విషయ పరి జ్ఞానం కూడా పెరుగుతుందని. శ్రీమతి వాదన.

'వాచ్‌మేన్ కూతురే కంప్యూటర్ కొన్నది. నువ్వాపాటి కూడా చెయ్యవా?' అని అనుకుంటుం దేమోనని భయం వేసింది.

ఈ నెల ఎలాగైనా కొనాలని తీర్మానించుకు న్నాను.

స్నానం చేసి బాల్కనీలో కూర్చుంటే నెమ్మ దిగా, నీరసంగా కాంపౌండ్‌లోకి వస్తూ కనిపిం చింది నీలవేణి. ఆ అమ్మాయితో ప్రత్యక్షంగా పరి చయం లేకపోయినా ఇంచుమించు రోజూ కనిపి స్తుంది.

ప్రొద్దున్న నేను వాకింగ్ నుంచి వస్తున్నప్పుడే హడావిడిగా వెళ్లిపోతూ కనిపిస్తుంది. 'పాపం ఇప్పుడు ఇంటికి తిరిగి వస్తుందన్నమాట. ఎంత కష్టపడుతుందో' అనుకున్నాను.

ఈ అమ్మాయి గురించి చాలా విషయాలు సేకరించింది శ్రీమతి. నీలవేణి చిన్నప్పటి నుంచీ చదువు మీద చాలా శ్రద్ధ చూపించేదట. చదు వంతా గవర్నమెంటు స్కూలు, కాలేజీలలోనే చద విందట.

వాళ్ల చుట్టాల్లో పిల్లకి ఇన్నేళ్లు వచ్చినా పెళ్లి చేయలేదని, వెలి వేసేస్తామన్నా, వాళ్ల నాన్న మాత్రం బాగా చదివించాలనే అనుకున్నాడట. అలాగే నీలవేణి బాగా చదువుకొని, ఉద్యోగం సంపాదించుకుందిట. రెండు నెలల నుంచి నాకు రోజూ నీలవేణి గురించి ఏదో ఒక విశేషం తెలు స్తూనే ఉంది.

భోజనాల టైములో కూడా నీలవేణి గుణగ ణాలు ఏకరువు పెడుతున్న శ్రీమతితో "ఇంతకీ ఏ కంపెనీలో చేస్తుంది?" యధాలాపంగా అడిగాను.

"నేను ఆ విషయం కనుక్కున్నానులెండి" అంటూ ఒక కంపెనీ పేరు చెప్పింది శ్రీమతి.

'అరె అది నా ఫ్రెండ్ శ్రీనివాస్ పనిచేస్తున్న కంపెనీయే. రేపు శనివారం వీలు చూసుకొని వాడిని కనుక్కోవాలని అనుకున్నాను. ఏదో ఆ అమ్మాయి గురించి కూపీ లాగుదామని కాదు గానీ, శ్రీనివాస్‌కి ఆ అమ్మాయిని పరిచయం చేస్తే, కొంత సాయం చేసినట్లు అవుతుందని' అనుకు న్నాను.

శనివారం ఆఫీసు నుంచీ, శ్రీనివాస్ ఆఫీసుకి వెళ్లాను.

కానీ, అక్కడ నీలవేణి అనే అమ్మాయి పనిచే యడం లేదని తెలిసి షాక్ తిన్నాను. ఏదో పొర పాటు జరిగి ఉంటాదని వాడితో అని, కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడి బయటపడ్డాను.

అప్పటి నుంచి మనసులో ఒకటే ఆలోచన పురుగులా దొలిచేస్తుంది. ఎందుకు ఆ అమ్మాయి అబద్ధం చెప్పి తల్లిదండ్రులను మోసం చేస్తుంది? ప్రొద్దున్నే వెళ్లి రాత్రి వరకూ ఏం చేస్తుంది? ఎక్కడ ఉంటుంది?

కంప్యూటర్ ఎలా కొనగలిగింది? అన్నీ జవాబు లేని ప్రశ్నలే! ఏమైనా చెయ్యకూడని పనులు చేస్తుందా? వద్దనుకున్నా మనసు ఆ వైపే ఆలోచిం చడం మొదలుపెట్టింది.

ఇంటికి చేరేసరికి శ్రీమతి "ఈ సంగతి విన్నారా?" అంటూ ఎదురు కాలేదు. ఏం జరిగి ఉంటుందా? అని లోపలకు వెళ్తే నీలవేణి అక్కడే ఉంది.

"వాళ్లమ్మకు ఒంట్లో బాగోలేదని, ఆఫీసు నుంచి వచ్చాక, ఇక్కడ పని చేయడానికి వచ్చింది. చూడండి ఎంత బాధ్యత తెలిసిన అమ్మాయో!" శ్రీమతి అభిమానం చాలా సంపా దించింది ఈ అమ్మాయి.

అసలు విషయం తెలిస్తే చాలా బాధపడతాది అనుకొన్నాను మనసులో.

అంతలో శ్రీమతి "ఏమండీ! నీలవేణి పనిచేసే ఆఫీసులోనే కదా శ్రీనివాస్ చేస్తున్నాడన్నారు. కలి శారా?" అని అడిగింది.

"ఆ కలిశాను" అన్నాను.

అప్పుడే టీ తీసుకొని వస్తున్న నీలవేణి ముఖం రంగు మారినట్టు అనిపించింది. చెప్పిన అబద్ధం తెలిసిపోయిందని అనుకున్నాను.

"ఏమండీ, శ్రీనివాస్‌కి నీలవేణి గురించి చెప్పారా? ఏంటీ ఏమీ మాట్లాడరేంటి?" గట్టిగా అడిగింది శ్రీమతి.

టీ కప్పుల ట్రే సెంటర్ టేబుల్ మీద పెడుతూ "మేడమ్ మీతో ఒక సంగతి చెప్పాలి" అంటూ సన్నగా మొదలుపెట్టింది నీలవేణి.

'ఏంటి' అన్నట్టు చూసింది శ్రీమతి.

"నేను మీకు చెప్పిన కంపెనీలో పనిచేయటం లేదు మేడమ్" నెమ్మదిగా అసలు విషయం బయ టపెట్టింది.

"అలాగా! మరి అలా ఎందుకు చెప్పావు?"

తెల్లబోతూ అడిగింది శ్రీమతి.

"ముందు మీరు కూర్చోండి మేడమ్" అంది.

నేను కూడా నీలవేణి చెప్పే సమాచారం వినడానికి కుతూహలంగా కూర్చున్నాను.

"నేను ఉద్యోగం చేస్తున్నానని, చాలామంది నాకు పొగరు ఎక్కువని అనుకొంటారు. కానీ, నాకు



ఎవరితోనూ మాట్లాడానికి టైము దొరకదు. అందుకే ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడను. మీరు నేను ఉద్యోగం చేస్తున్నానని, చాలా సరదా పడుతున్నారని తెలుసు. అందుకే మీరు అడిగినప్పుడు, ఏదో నా నోటికి వచ్చిన కంపెనీ పేరు చెప్పాను. నా దురదృష్టం. అది సార్ ఫ్రెండ్ ఆఫీసు అయింది'' అంటూ ఆగింది.

“ఇంతకీ నువ్వేం చేస్తున్నావు? అంత అబద్ధం చెప్పాల్సిన అవసరమేం వచ్చింది'' కొంచెం కరుగ్గానే అడిగింది శ్రీమతి.

దానికి నీలవేణి, “మీరు కొత్తగా వచ్చారు మేడమ్. మీకు మా గురించి ఏమీ తెలియదు. మా అమ్మ, నాన్న ఎన్నో అవసరాలు చంపుకొని ఎంతో కష్టపడి నన్ను చదివించారు. నేను ఉద్యోగం చేయాలన్నది వాళ్ల కోరిక. కానీ, మంచి ఇంగ్లీష్ మీడియం కాలేజీలో చదుకొని అదనపు క్వాలిఫికేషన్ ఉన్న వాళ్లకే ఉద్యోగాలు రాని ఈ రోజుల్లో నాకు ఎలా వస్తుంది? అందుకే బాగా ఆలోచించి నాకు తోచిన పని చేస్తున్నాను'' అని ఊపిరి పీల్చుకోవడానికి ఆగింది నీలవేణి.

నీలవేణి చెప్పబోయే విషయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం నేను, శ్రీమతి.

“రెండు వీధుల అవతల 'సాయి ఎన్‌క్లేవ్' అనే అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి కదా!'' అంది నీలవేణి.

అవును అవి చాలా ఖరీదైన అపార్ట్‌మెంట్స్. దాంట్లో అద్దె 10 వేల నుంచి 15వేల వరకూ ఉంటుందని వినికిడి.

'ఇంతకీ వాటికీ, నీలవేణి చేసే ఉద్యోగానికి సంబంధం ఏమిటి?'

“ఆ అపార్ట్‌మెంట్స్‌లో నాలుగైదు ఇళ్లల్లో పనిచేస్తున్నాను'' నెమ్మదిగా చెప్పింది నీలవేణి.

ఖంగు తిన్నాం నేను, శ్రీమతి.

“ఏమిటి!'' ఇద్దరం ఒకేసారి ఆశ్చర్యంగా అడిగాం.

“అవును సార్! అంతకంటే ఏం చెయ్యాలో నాకు తోచలేదు. అక్కడ జీతాలు బాగా ఇస్తారు. దానికి తగ్గట్టే పని కూడా ఉంటుంది. అందుకే ప్రొద్దున్న వెళ్తే రాత్రి అవుతుంది. మధ్యాహ్నం కూడా అక్కడే ఉండిపోయి ఎవరికైనా పనిలో సాయం కావాలంటే చేస్తాను. కొంతమందికి బట్టలు ఇస్త్రీ చేసి పెడతాను'' అంటూ తన 'ఉద్యోగం' గురించి చెప్పింది నీలవేణి.

“మరి కంప్యూటర్...?'' అడిగింది శ్రీమతి.

“నేను పనిచేసే ఒక ఇంటివాళ్ల అమ్మాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. ఆ అమ్మాయి ఒకసారి ఉద్యోగం మారినప్పుడు, ఒక నెల రోజులు ఇంట్లోనే ఉంది. అప్పుడు నా సరదా చూసి మధ్యాహ్నం ఖాళీగా ఉన్నప్పుడు నాకు నేర్పించేది. పోయిన వారం ఆ అమ్మాయి కొత్త మోడల్ కంప్యూటర్ కొనుక్కుంది. పాతది అమ్మేయాలని అనుకొంటున్నారు. ఎంత వస్తుంది అని అడిగితే, “సెకండ్ హేండ్ కదా! పెద్దగా రాదు'' అన్నారు. అప్పుడు జీతంలో తీసుకొని నాకే ఇమ్మని అడిగాను. కంప్యూటర్ ఎలా వచ్చిందో వివరించింది నీలవేణి.

“మరి మీ అమ్మవాళ్లకి అబద్ధం ఎందుకు చెప్పావు. ఎప్పటికైనా తెలియకుండా ఉంటుందా?'' అని అడిగాను.

“తెలిస్తే చాలా బాధపడతారు సార్! మా అమ్మ తను చేస్తున్న పనే నేనూ చేస్తున్నానని తెలిస్తే తట్టుకోలేదు సార్!'' కన్నీరు తుడుచుకుంటూ చెప్పింది నీలవేణి.


“చెప్పెయ్యటమే మంచిది. ఇంకెవరి ద్వారానైనా తెలిస్తే ఇంకా బాధపడతారు కదా!'' అంది శ్రీమతి.

“లేదు మేడమ్. చెప్పను. చెప్పాల్సిన అవసరం లేకుండా చేస్తోంది. దేవుడు మీద నాకు నమ్మకం ఉంది. నెలనెలా కొంత డబ్బు బ్యాంకులో వేస్తున్నాను. దానితో కంప్యూటర్ కోర్స్‌లో చేరతాను. మీలాంటి వారెవరైనా సాయం చేస్తే అబద్ధమైనా నా ఉద్యోగం నిజంగా వస్తుందన్న నమ్మకంగా ఉంది. మీరు అమ్మతో ఏమీ చెప్పకండి మేడమ్'' అంటూ పని అయిపోయిందని వెళ్లిపోయింది.

కొంచెం సేపు ఇద్దరం మౌనంగా ఉండిపోయాం. మన ఇళ్లల్లో ఎంతమంది ఈ వయసు పిల్లలు ప్రతీదానికీ తల్లిదండ్రుల మీద ఆధారపడి ఉంటారు? వాళ్లకి బాగా డబ్బు ఖర్చు పెట్టి, మంచి కాలేజీలలో చదివిస్తాం. వాళ్లకి నీలవేణి ఎందులో తీసిపోతుంది? ఇంకా వాళ్లకన్నా చాలా మెట్లపైనే ఉందనిపించింది.

ఆర్థికంగా తక్కువ స్థాయిలో ఉన్నా కష్టపడి చదువుకొని, ఉద్యోగం వచ్చే వరకూ ఖాళీగా ఉండకుండా తనకు చేతనైన పనిచేస్తూ, భవిష్యత్తు మీద గంపెడు నమ్మకంతో, భగవంతుడిపై కొండంత విశ్వాసంతో ఉన్న నీలవేణి ఎప్పటికైనా అనుకున్నది సాధిస్తుందని, సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను.

★



## త్రిషకి నచ్చిన సినిమా

సినిమా తారలకి కూడా నచ్చిన సినిమాలు వుంటాయా? ఎందుకుండవూ? త్రిషకి బాగా నచ్చిన సినిమా ఒకటి వుందిట. అది కూడా ఓ హాలీవుడ్ సినిమా. 'ఇంగ్లీష్ పేషెంట్' అనే ఈ సినిమాని ఆమె ఇప్పటికి వందసార్లు పైగానే చూసిందిట. ముందు ముందు వీలైతే మరో రెండొందల సార్లయినా చూడాలని తెగ సంబరపడిపోతోందిట త్రిష. ఆమెకి అంత బాగా నచ్చిన ఆ సినిమాలో ఏం ప్రత్యేకత వుందో?

